# మాతృహృదయం

కళ్ళు తెరచి చుట్టూ చూసింది పార్వతి...

తెల్లగా వెల్లవేసిన గోడలమీద ఎలక్ట్రిక్ లైటు కాంతి పడుతోంది....

ఆమె తలవైపున కూర్చుని ముఖంలోకి ఆత్రంగా చూస్తోంది అమ్మ ...

పార్వతి అయోమయంగా గదిని కలయ జూసింది.

తాను పడుకుని వున్నది, ఇంట్లో కాదనీ; శారదా మెటర్నిటీ హోమ్‌లోని ఒక గదిలోననీ, అప్పటికి అర్థం చేసుకున్న పార్వతి, ఉయ్యాల కోసం చూసింది ... ఆమెకళ్ళు మెరిశాయి...

తను మాతృమూర్తి!!

పార్వతి నీరసమైన పెదవులమీద తృప్తితో నిండిన చిరునవ్వు నాట్యం చేసింది ...

తను మాతృమూర్తి!! ఎంత ఆద్భుతతలపు!!

"ఎలా వుందే పార్వతి ..!" అంది అమ్మ ...

అమ్మ ముఖంలో, తానూ అమ్మమ్మ నయ్యానన్న సంతోషం వెల్లివిరియడం లేదు...

ఎన్నో రోజులుగా ఎదురుచూసిన ఆనందం, అమ్మ ముఖంలో ఏంటు కాగడాకి కూడా కన పడటంలేదు. ఎందుకని?

పార్వతి ఉత్సాహం సగం చచ్చిపోయింది...

పెద్ద పెద్ద కళ్ళతో ఉయ్యాలవైపు చూసి "పాప ... ఒక్కసారి ... చూడాలి ..." అంది నీరసంగా .

అమ్మ కళ్ళవెంట రెండు నీటి బిందువులు జలజలా రాలి పార్వతి నుదుటిమీద పడ్డాయి...

పార్వతి తెల్లబోయింది... ఆమె గుండె వేగంగా స్పందించింది... తన పాప ఎక్కడ? ఉయ్యాలలో లేదా? గది తలుపు తెరుచుకుని సిస్టర్ లోపలికి వచ్చింది..

"ఓ పార్వతిగారు కాన్షస్‌గా ఉన్నారే ... వెరి గుడ్

ఆమె నెక్కువగా మాట్లాడించకండి ..." అంది ... ఆమె ముఖంలో గర్వం చదివింది పార్వతి...

"పాప ఎక్కడ సిస్టర్ .. చూడాలి ..." పార్వతికంఠ కంఠం పెగలలేదు.

సిస్టర్ జాలిగా చూసింది ... వెంటనే తన చేతి గడియారం చూసుకుని" డాక్టర్‌గారు వచ్చే టైమైంది... మీరు కదలకుండా పడుకోండి.." ఎక్కువగా మాట్లాడకండి ..." అనేసి చకచకా వెళ్ళిపోయింది.

ఒక్క వుదుటున మంచంమీదనుంచి లేచి ఉయ్యాలలోనుంచి పాపను తీసుకుని హృదయా నికి హత్తుకోవాలనుకుంది పార్వతి ..

కానీ ఆమె శరీరం ఆమె ఆధీనంలో లేదు... మంచంమీదనుంచి సెంటీమీటరు మేరకూడా జరగలేకపోయింది. తన శరీరంలోని బలమంతా ఏమైపోయినట్లు? తనకేం జరిగింది?

బయట చెప్పుల చప్పుడు ...

డాక్టర్ ఉషారాణి లోపలికి వచ్చింది ...

ఉషారాణి పార్వతికి స్నేహితురాలు కూడా ...

అమ్మని పిలిచి చెవిలో ఏదో చెప్పింది ఉషారాణి.

అమ్మ బయటకు వెళ్ళిపోయింది.

ఉషారాణి నవ్వింది... "హల్లో పార్వతి — ఎలావుంది ఒంట్లో నీకు?" అంది... ఆమెనవ్వులో జాలి తొంగి చూసింది...

"పాపని చూపించవ్?" కళ్ళనిండా నీళ్ళు నింపుకుని జాలిగా అడిగింది పార్వతి ...

ఉషారాణి స్టెతస్కోప్‌తో పార్వతి గుండె పరీక్ష చేసింది... సిస్టర్ అందించిన సిరెంజితో ఏదో ఇంట్రావీనస్ ఇంజెక్షన్ చేసింది... టెంపరేచర్ ఛార్టు చూసింది... ఆమె ముఖం గర్వంతో మెరిసిపోయింది...

"నా ఈ అయిదేళ్ళ ప్రాక్టీస్‌లో ఈ కేసుని ఎన్నడూ మర్చిపోలేను ... నీమీద నాకు విశ్వాసం కుదిర్చిన కేసు ఇది.." ఉషారాణి స్వగతంగా అను కుంది.

"ఉషా! పాపని చూపించవ్?" పార్వతి దీనంగా అడిగింది.

ఉషారాణి కళ్ళు చెమ్మగిల్లాయి...

ఉత్సాహం తెచ్చిపెట్టుకుని పార్వతి భుజంమీద తడుతూ "పార్వతీ... ఇవ్వాళ నీకు పాపని చూపిం చటం వీలవదు ... పాపనివేరే వుంచవలసి వచ్చింది. రేపు ..." అంది ఉషారాణి.

ఆమె ఇంక అక్కడ నిలబడలేక పోయింది... స్టెతోమెడకి తగిలించుకుని చకచకానడిచి వెళ్ళింది ఉషారాణి ... ఆమె వెనుక జాలిగా నిట్టూరుస్తూ బాగుపట్టుకుని వెళ్ళిపోయింది సిస్టర్.

వీళ్ళంతా తనకి చెప్పకుండా ఏదో దాచిపెడు తున్నారు... లేకపోతే ప్రక్కనే వుయ్యాల వుండగా, పాపను వేరేచోట వుంచవలసిన అగత్యం ఏమిటి?

ఒకవేళ తన పాప ...!! భగవాన్! తానెంత క్రూరంగా ఆలోచిస్తోంది!!!

తన మనస్సులోని అమంగళాలనుంచి భగవంతుడిని క్షమాపణ వేడుకుని, వేదనగా ప్రక్కమీద వాల్చింది పార్వతి ....

సాయంత్రం రాజారావు వస్తాడు. తను చూడాలని ! అతనీపాటికింకా పాపని చూడలేదుగా!!

వూరించి, వూరించి పాపని చూపించాలి!

పార్వతికి నవ్వొచ్చింది. అమ్మనీ, ఉషనీ, పోనీ కనీసం సిస్టర్‌నయినా తను, తనకి కలిగింది ఏ పాపో అడిగిందా? అబ్బాయో, అమ్మాయో!

ఎంతటి మందబుద్ధి!!

అమ్మ మళ్ళీ అరగంటకి వస్తుంది.. అప్పుడు చెప్పదూ? సంతోషంగా చెబుతుంది!

మరి అమ్మ ముఖంలో ఆ విచారమెందుకు?

తనను చూసి వీళ్ళంతా జాలిపడటం దేనికి?

మళ్ళీ ఆమె హృదయాన్ని బాధ చుట్టు ముట్టింది...అంతుదొరకని ఆలోచనలతో అలసి పోయి, మగతగా కనులు మూసుకుని, నిద్ర పోయింది పార్వతి. ఆమె కనులు తెరచి చూసే వేళకు, ఎదురుగా గోడకు తగిల్చిన సరికొత్త గడి యారం సాయంత్రం అయిదు చూపింది.

ప్రక్క కుర్చీలో కూర్చున్న రాజారావు పెద వులు ఆప్యాయంగా చిరునవ్వు చిందాయి... పార్వతి నవ్వాలని ప్రయత్నించింది...



"నే నదృష్టవంతుడిని పార్వతీ..." అన్నాడు రాజారావు...

"ఎందుకని?" అన్నట్లు చూసింది పార్వతి.

బల్లమీద ఎదురుగా గులాబిపువ్వుల గుత్తి, యాపిల్ పళ్ళు కనపడ్డాయి పార్వతికి...

రాజారావు ముఖం సగం తగ్గిపోయింది. కళ్ళు [illegible] లోతుకు పోయాయి!

పార్వతి అయోమయంగా చూసింది అదృష్టవంతుడిని.

"మన పాప ..." పార్వతి గొణిగింది...

రాజారావు తెల్లబోయాడు ... "పార్వతీ ..." అన్నాడు.. "నువ్వు దక్కావు ... అంతే చాలు..." అన్నాడు.

పార్వతి ఎదురుగా పిడుగుపడినట్లయింది.

తను పడుకున్న మంచం వలయాలు తిరిగినట్లయింది. రాజారావూ, ఎదురుగా బల్లమీది గులాబీలు, ఏవీ కనపడటంలేదు...

**అమ్మ ముఖంలోని దైన్యానికీ, ఉషారాణి జాలి** చూపులకీ, సిస్టర్ ముఖంలో గర్వానికీ కారణం తెలిసిన తరువాత రెండేళ్ళ పార్వతి, రెండు అరచేతుల్లోనూ ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడిచింది......

రాజారావు చెప్పుకుపోతున్నాడు.. అతను చెప్పిన మాటల సారాంశం యిది !! తనకి మూడు రోజుల క్రితం పాప పుట్టింది..అతి కష్టం మీద. ఆపరేషన్ చేసి పాపను భూమిమీదవేశారు,ఉషారాణి మరో ఇద్దరు సర్జన్లూ ! పాప అప్పుడే కళ్ళుమూసుకుంది.. పార్వతికి మూడు రోజుల నుంచీ స్పృహ లేదు... రక్తమూ, ఆక్సిజనూ ఎక్కించిన తరువాత ఆమె మళ్ళీ కళ్ళు తెరిచి లోకాన్ని చూసింది.

పార్వతి విస్మృతి.. అంతా విస్మృతి...

పిచ్చి పిచ్చి సొమ్మసిల్లిపోయింది పార్వతి.

రాజారావు స్థాణువులా కూర్చుండిపోయాడు.. అంతవరకి ఉషారాణి వచ్చింది.

**ఆమెకి చేతనయినంత ఛాటుగా, పదునైన** మాటలతో రాజారావుని కోపగించింది.. ఆశ తొందరపాటుకీ, తెలివి తక్కువకీ విచారించింది

ఇంకా రెండు రోజులు గడిచాక, మెల్లిగా సానుభూతినిండిన మాటలతో పార్వతికి చెప్పి వుంటే బాగుండేదన్నది.........

రాజారావు చిన్న పిల్లవాడిలా బావురుమని ఏడవాలనుకున్నాడు...

ఆ రాత్రి అతను, ఏకాంతంలో రెండు చేతులూ జోడించి, "ఓ భగవాన్! నేనేం పాపం చేశానని నన్నిలా పరీక్షిస్తున్నావు ? పార్వతిని నేనెంత గాఢంగా ప్రేమించి పెళ్ళాడానో నీకు తెలిదా ? ఆమె లేకపోతే నేనెక్కడ ఉంటాను ? నా పార్వతిని నాకు దక్కించు ........" అని వేడుకున్నాడు...

ఆపదసమయంలో భగవంతుడిని అందరూ ప్రార్థిస్తారు. భగవంతుడి ఉనికి పట్ల విశ్వాసం లేనివాళ్ళు, తనని తాను నమ్ముకొనేవాళ్ళు

(మిగతా 46 వ పేజీలో)

# ఇంద్ర ధనస్సు

[41 వ పేజీ తరువాయి]

స్తైతం ఆపదలు చుట్టిముట్టినప్పుడు," "హే భగవాన్"! అనుకుంటారు....

ఆయన వీళ్ళని చూసి నవ్వుకుంటాడేమో! అయినా ఆ భగవంతుడు రాజారావు ప్రార్థన ఆలకించాడేమో !!

పది రోజుల తరువాత అప్పుడే పెంజరాన్ని చీరతో కప్పుకుని, ఇంటికి చేరుకుంది పార్వతి.......... ఉషస్సులు కనిపించే పెదవులమీద అందమైన చిరునవ్వులు నాట్యం చేయడం రాజారావుకి, కనిపించలేదు...

పాలిపోయిన పార్వతి రెండు పెదవులూ, లత డిని చూసి పేలవంగా, నిర్జీవంగా నవ్వాయి.... అతనికి సంతోషంగానే వుంది.... అతనికి కావలింది పార్వతి.....

రాజారావు ఎప్పుడూ సంతానం కోసం కలవరించి కలలు కనలేదు..

పొరుగింటి అందమైన పాపలు అతన్ని "మామ" అని పిలిచి చప్పట్లు కొట్టినా, అతను వాళ్ళని చేరదీసేవాడు కాదు..........

రాజారావుకి పార్వతి చాలును..

పసితనంలోని అమాయకత్వం అతనికి పార్వతి లోనే కనిపిస్తుంది......

పార్వతికి పిల్లలు కావాలి... సంతానం కోసం కలలు కన్నది పార్వతి. . గాలి మేడలు కట్టింది....

పార్వతేకాదు.. స్త్రీ లందరూ సంతానాన్ని కోరతారు. మాతృత్వాన్ని వాంఛిస్తారు.. మాతృత్వం కోసం తపిస్తారు...అది సహజం.

రాజారావుకి తెలుసును.. పార్వతి తీరని ఆశాభంగం పొందిందనీ, ఆమె దిగులుతో కృంగిపోతోందనీ... ఆమెనెలా సంతోషపెట్టడం? ఆమెనెలాగ మళ్ళీ పూర్వపు నిలిపి పార్వతిగా చెయ్యటం ?

రాజారావుకు పార్వతి దక్కిందనే ఆనందం, పది రోజులు తిరక్కుండానే మటుమాయమైంది!

"పాప బ్రతికి వుంటే బాగుండేది !" అనుకున్నాడు, మొదటిసారిగా.....

పార్వతి సరిగా భోజనం చెయ్యదు.. రాత్రిపూట నిద్రపోదు.. ఒకటే వేదన..అంతులేని ఆవేదన.

"అబ్బాయ్ ! దాన్ని మావూరు తీసుకు పోయి నెల రోజులు వుంచుకుని పంపిస్తాను !" అన్నది అత్తగారు....

పార్వతికి స్థలం మార్పు వలన కొంత దిగులు తీరుతుందేమో ! అక్కడ చెల్లెళ్ళూ, అన్నలూ, వదినెలతో కులాసాగా కాలక్షేపం చేస్తూ, ఈ బాధలు కొంత మరిచి పోతుందేమో! ఎందుకు కాదనాలి ?

"సరే !" అన్నాడు రాజారావు...

ఆ రాత్రి పార్వతి, టేబిల్ లైటు వెలుగులో ఉత్తరం రాస్తుండగా రాజారావు చూశాడు..

ఆమె వ్రాస్తున్న తెల్లని కాగితాలమీద కళ్ళ నుంచి రెండు నీటి బిందువులు రాలి "ఎస్టప్" మని పడ్డాయి......

ఎవరికో ఆ వుత్తరం ?

పార్వతి వుత్తరం మడిచి టేబిల్ మీద పడేసి వెళ్ళి పడుకుంది.

రాజారావుకి తనుచేస్తున్నపని తప్పని తెలుసు ? అయినా అతను పార్వతి కోసం ఎన్ని తప్పులైనా చెయ్యదలుచుకున్నాడు..

ఉత్తరం మడత విప్పి చదివాడు రాజారావు. పార్వతి స్నేహితురాలు సుశీలకి రాసిన వుత్తరమది!

"నాకు చచ్చి పోవాలని పిస్తోంది సుశీలా ! ఈ ప్రపంచంలో నన్నుఅర్థం చేసుకునే వాళ్ళు ఇద్దరే. నువ్వు, మావారూ.... ఆయనకు నేను దక్కానన్న సంతోషం తప్ప మరే దిగులూ లేదు..నాకే, నాబాధ ఎవరితో చెప్పుకోను సుశీలా........నాకు జీవితం మీద రోత కలుగుతోంది.. ఇరవై రెండేళ్ళకే నేను జీవితంలోని బాధలన్నీ అనుభవించేశాను....." రాజారావు హృదయం జాలిగా మూలిగింది!

"పార్వతీ..నువ్వెంత పిచ్చిదానివి !" అనుకున్నాడు. మరునాడు పొద్దున పార్వతి జట్కా ఎక్కి అమ్మతో పాటు వెళ్ళిపోయింది.

రోజూ జాగ్రత్తగా మందులు తీసుకుంటానని, చిరాకు పడకుండా కాలం గడుపుతానని ప్రమాణం చేయించుకుని రైలు ఎక్కించాడు రాజారావు ...

పార్వతి వెళ్ళగానే వుత్తరం రాసింది...... ...

పార్వతి వెళ్ళిన వారం రోజులకి సుశీల దగ్గర్నుంచి జవాబు వచ్చింది. రాజారావుకి సుశీల వ్రాసే వుత్తరాలంటే చాలా ఇష్టం... చిన్న వయసులోనే అనేక జీవిత సత్యాలను అర్థం చేసుకుని వేదాంతాన్ని జీర్ణం చేసుకుంది ఆమె....

రాజారావుకి ఆమె వుత్తరాలు చదువుకునే హక్కు పార్వతి ఎప్పుడో ఇచ్చేసింది. అది దాంపత్యంలో వారి ఇద్దరి ప్రేమకి ఒక ఉదాహరణ మాత్రమే......

"నిన్ను చూస్తే జాలి వేస్తోంది పార్వతీ... అంత చదువుకున్న తెలివైన మనుష్యులు కలవాళ్ళు ఈ ప్రపంచంలో ఎలా బ్రతక గలరా అని అనుకున్నాను ....

నీబాధ నేనర్థం చేసుకోగలను. . . కలలు కనటం, అవి ఫలించే రోజులకోసం ఆత్రంగా ఎదురుచూడటం మాత్రమే మనవంతు పార్వతీ ! అవన్నీ కల్లలౌతయ్! అది భగవంతుడి లీలా విలాసాల్లో ఒకటి . . . ఈ ప్రపంచంలో మన జీవితాలు పరమాణువులు. .. రేపేమి జరగబోతుందో మనకి తెలుసా పార్వతీ! ఈలా లోకమంతా కలలు కనటానికి అలవాటుపడి వుంటారు.. వాళ్ళంతా ఈ ఆశాభంగాలకి తట్టుకోలేరు. . జీవితంలో అనేక తుఫానులు ఎదుర్కొవటానికి తట్టుకోగలగాలి పార్వతి.. అందుకు కొంత మానసిక బలం కావాలి.. నిగ్రహం కావాలి! సహనం కావాలి. . . అవును, ఆశాభంగాలు కలిగినప్పుడు చలించకుండా వుంటే మంచిదని చాలామంది అంటారు. . . అలా చలించకుండా వుండలేను. పార్వతి. . . మనం బ్రతకాలి! మనం బ్రతకాలి, మనం ప్రేమించే వారికి కూడా ప్రాణాలర్పించ గలిగేటంత గొప్పవాళ్ళమైనా మనం బ్రతకాలి. మనం మనకోసం బ్రతకం. మన బ్రతుకెప్పుడూ ఇతరుల కోసమే . . ఇతరులని సంతోష పెట్టడం కోసమే. అలా అని తెలుసుకుని జీవిస్తే ఎంతో తృప్తి. నువ్వు బ్రతుకుతున్నది రాజారావుగారి కోసమనుకో! ఆయనకి నువ్వవాలును. ఆయన సంతోషమే నీకు కావాలని ఎందుకనుకోవు పార్వతీ!నువిలా



కొంతో కుదుటపడితే. ఆమెను ఎంత బాధపడ దాడు ? —"

రాజారావు కాపుత్తరం ఎంతో శాంతినిచ్చింది. సుశీల చెబితే పార్వతి వింటుంది.

పార్వతికి సుశీల ఆప్తమిత్రురాలు.

ఆ పుత్తరాన్ని వెంటనే పార్వతికి పంపించాడు రాజారావు. . .

ఉత్తరమంతా చదివి నిట్టూర్పు విడిచింది పార్వతి. ఆమెకి ఓదార్పు మాటలు చాలలేదు. . .

సుశీల చెప్పిన ధైర్యం ఆమెకి మనశ్శాంతి నివ్వలేదు. స్త్రీ జీవితానికి ఎంత వెలుగు ప్రసాదించే మాతృత్వానికి తాను ఈ జన్మకింక అర్హురాలు కాదు. . . ఆజన్మాంతం ఒంటరిగా దిక్కుదిక్కుమంటూ గడపవలసిందే!

తనేం పాపం చేసిందని తనకీ శిక్ష ?

ఈ సంగతి తెలిసి రాజారావెంత సంతోషంగా వుంటాడని!! అతనికి తనపైన జాలిలేదా ?

రాజారావు మనస్సు యింత కఠినమైనదా ? అతని కోరికలు తీర్చుకోడానికి తను బ్రతికితే చాలునా ?

ఇటువంటి ఆలోచనల్లో పడిపోయింది పార్వతి. "ఛీ! ఏం మగవాళ్ళు!!" అనుకుంది.

పైగా సుశీల ఎలా వ్రాసింది!

ధైర్యంగా వుండాలిట!! నిర్లిప్తత అలవడాలిట!! వేదాంతాలు వల్లించటానికేం ? తనకేం తెలుస్తుంది. అనుభవించిదకాని బాధలు అర్థం కావు. . .

రాజారావు మళ్ళీ వుత్తరం వ్రాశాడు.

పార్వతికతనంటే ద్వేషమేమీలేదు. జవాబు వ్రాయాలని కూర్చుంది. కలం కదలలేదు. . . కాగితాలు చింపేసింది!! ఇంత కఠినాత్ముడికి తనేం వ్రాయాలని!!

రాజారావు పార్వతికి, "నువ్వు బ్రతికినందుకు నేనెంతో సంతోషిస్తాను పార్వతీ . . నువ్వు నాకు చాలు . . మనిద్దరం చాలమా ? మనకి పిల్లలు లేకపోతే ఏం ?" అని వ్రాసేకన్నా,

"మనం చాలా అదృష్టహీనులం పార్వతీ. . . ఆజన్మాంతం మనిద్దరం పిల్లలకోసం అలమటిస్తూ బ్రతకవలసిందేనా ? నీబాధ నేనెలా తీర్చను పార్వతీ—" అని వ్రాసివుంటే పార్వతికి తృప్తిగా వుండేదేమో!

ఎవరైనా తమబాధలనుగురించి చెప్పినప్పుడు "ఇలాంటి బాధలందరికీ వుంటాయి. ధైర్యంగా వుండాలి!" అని చెబితే, వాళ్ళకి తృప్తిగావుండదు. నిజమేసుమా! నీబాధ చాలాగొప్పది . . .నేనైతే ఆత్మహత్య చేసుకొనివుందును . . ఇంకా నువ్వు కాబట్టి నెగ్గుకొస్తున్నావు" అంటే వాళ్ళకెంతో తృప్తి . . మనమీద గౌరవంకూడా కలుగుతుంది.

పార్వతి కోలుకోసాగింది. ఆమె ఆరోగ్యం మెరుగైంది. .

రెండునెలల అనంతరం పార్వతిని తీసుకొచ్చుకున్నాడు రాజారావు. . .

పార్వతి చాలా మారిపోయింది. . .

ఏదో చిత్రమైన వైరాగ్యం అలవడింది. . .

జాజిపందిరిని పూలుకోసి ముడుచుకోదు. . . ఇంట్లో పువ్వులకుండీలో పువ్వులు వాడిపోయినా, వాటిని మార్చదు.

"నీదిగులు నేనెలా తీర్చను పార్వతీ. . నువ్విలా బాధపడితే నేనేం కావాలి పార్వతీ—" అన్నాడు రాజారావు. . .

"నేను బ్రతికాను. . చాలుగా మీకు" అంది పార్వతి.

రాజారావు తెల్లబోయాడు. . .

అతనికి పార్వతి మనస్థితి అర్థమైంది!

"ఆడవాళ్ళు చాలా చిత్రమైనవాళ్ళు!!" అనుకున్నాడు.

"మనం దురదృష్టవంతులం పార్వతీ ! . . మన దిగులు తీరేదికాదు. . కానీ ఇలా ఎన్నాళ్ళు బాధపడతాం! నేనే దిగులుపడితే నువ్వేమవుతావో నని నా దుఃఖాన్ని ఎలా అణిచివేసుకుంటున్నానో తెలుసా!!— సంతోషంగా వుండాలి పార్వతీ. . . బాధలు మర్చిపోవాలి. . ." అన్నాడు రాజారావు. .

పార్వతి అతనివంక అనుమానంగా చూసి "మీకూ దిగులుగా వుందా ?" అంది. .

రాజారావు పేలవంగా నవ్వి, "నన్నింత అర్థం చేసుకున్నావన్నమాట!!" అన్నాడు.

పార్వతి కళ్ళు నీళ్ళు నింపుకున్నాయి.

అతని గుండెలమీదవాలి వెక్కి వెక్కి ఏడిచింది

"నేను మూర్ఖురాలిని, మిమ్మల్నిపాటుగా అర్థం చేసుకున్నాను...నాకు మీరు చాలు మీసంతోషమే నాకు చాలు . ." అంది. . .

రాజారావు పార్వతి తలనిమిరి, "పిచ్చిపిల్లా" అన్నాడు.

పార్వతి నవ్వింది. . . ఆ నవ్వులో ఆశ కనపడింది. మరుక్షణమే సుశీలకి ఉత్తరం వ్రాసింది




పార్వతి. సుశీల యిచ్చిన సలహాను మెచ్చుకుంది.

త్వరలో సుశీల తల్లి కావాలని దీవించింది..

పార్వతికిప్పుడు దిగులులేదనికాదు. . .ఆ దిగులుని మర్చిపోయేందుకు ఆమె చాలా కృషిచేసింది.

రాజారావుమీద ఆమెకి జాలైంది..

"అతను చాలా మంచివాడు. . అతనిమనస్సు నవనీతం . . . నేను పొరపడ్డాను. ."అనుకుంది పార్వతి. కాలం తిరిగిపోతోంది. . .

సుశీల వ్రాసింది — తనూ తల్లిని కాబోతున్నానని.

సుశీలకి తనకిమల్లే ఏఅపాయమూ సంభవించ కూడదని మనస్సులో గాఢంగా కోరుకుంది పార్వతి. సుశీల చాలా మంచిది.

జీవితంలో అనేకఒడుదుడుకులకు తట్టుకుంది. ఆమె జీవితానికి జ్యోతి ఆమె కనబోయే పాప! సుశీలదగ్గరనుంచి శుభవార్త కోసం ఆదుర్దాతో ఎదురుచూసింది పార్వతి ... నెలలు గడిచాయి...

ఓనాటి సాయంత్రం సుశీల దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది...

కళ్లనిండా నీళ్లు నింపుకుని రైలెక్కింది పార్వతి. తన సుశీ ఏమవుతుంది? తన సుశీ ... అమ్మో సుశీ!! "భగవాన్! సుశీని బ్రతికించు..." అనుకుంది.

మానవుల మనస్సులు ఎంత చంచలమైనవో తలుచుకుంటే, అంత బాధలోనూ నవ్వొచ్చింది రాజారావుకి! పార్వతి దక్కింది చాలని తను అనుకున్నందుకు, తనని కఠిన మనస్సుడిగా ఎంచింది పార్వతి.

ఆ పార్వతే, తన స్నేహితురాలు బ్రతికితే చాలని కోరుకుంటోంది...

పాప ఏమైనా ఫరవాలేదని కాబోలు!!!

"పార్వతీ!!" అనుకున్నాడు రాజారావు...

సుశీలకి ఆడపిల్ల కలిగింది...

పాప బొద్దుగా, అందంగా ఉయ్యాలలో ఆడుకుంటోంది...

సుశీల కళ్లలో ప్రాణాలు నిలుపుకుని, పార్వతి కోసమే నవ్వుతున్నట్లుగా ఎదురు చూస్తోంది...

పార్వతిని చూసి సుశీలతల్లి బావురుమని ఏడిచింది. సుశీల పార్వతిని చూసి మెల్లిగా సైగ చేసింది. ఆమె మంచంమీద కూర్చుంది పార్వతి.

తల్లిని పిలిచి, పాపని తీసుకు రమ్మంది సుశీల.

పార్వతి పాపని తన వళ్లోకి తీసుకుంది.

"నేనింక .. బ్రతకను ... పాపని ... నీకిస్తున్నాను...." అంది సుశీల....

"నాకు పాప వద్దు... నువ్వు కావాలి .. నువ్వు కావాలి సుశీ ...నువ్వుకావాలి ..." అంది పార్వతి.

ఆవేశంగా కట్టలు తెగిన దుఃఖాన్నిదాచుకోలేక!

"ఈ పార్వతి మాతృత్వాన్ని కోరడంలేదా? పిల్లలను ప్రేమించదా!" అనుకున్నాడురాజారావు.

సుశీల నవ్వింది... "నేను బ్రతకను..."అంది.

మృత్యుముఖంలోకి అడుగు పెడుతూ కూడా ఎంత ధైర్యంగా వుంది సుశీల! ఆమె ముఖంలోని చిరునవ్వు ఎంత దివ్యంగా వెలిగిపోతోంది!!

"సుశీలా — నిన్ను చూసి నేర్చుకోదగింది చాలా వుంది!!" అనుకుంది పార్వతి.

రెండు రోజుల అనంతరం, యమ బాధను అనుభవించి, కళ్లు మూసింది సుశీల.

"ఈ పాప పుట్టకపోతే ఏం!" అనుకుంది పార్వతి.

సుశీల ఎంత మంచిది!

సంస్కారంగల యువతి ఆమె.

ప్రేమించి పెళ్లిచేసుకుంది.. జీవితం గురించి అందమైన కలలు కన్నది.

పెళ్లయిన కొద్దిరోజులకే కళ్లు మూసింది..

ఆ సుశీల బ్రతకకూడదూ? తను సుశీలని ఎంత గాఢంగా ప్రేమించిందని!!

పాపని ఎత్తుకుని ముద్దు పెట్టుకోవాలనే అనిపించలేదు పార్వతికి...

తన సుశీ మరణానికి ఈ పాపే కారణంగదా!

సుశీల భర్తని చూసింది పార్వతి...

అతని కళ్లలో బాధాజ్వాలలు విస్ఫులింగాలు వెదజల్లుతున్నాయి... "పాపం!" అనిపించింది.

అతనికి భార్య దక్కలేదు... పాపని కూడా కావాలనుకోటం లేదా!!

రైలు కదిలింది... చీకట్లని చీల్చుకుని వెళ్లిపోతోంది...

పార్వతి వొళ్లో పాప అమాయకంగా నవ్వుకుంది.

ఈలోకం ఎంత చిత్రమైనది!

రాజారావు వేదాంతిలా నవ్వుకున్నాడు.

అతని కళ్లముందు,రెండేళ్ల కిందటి పార్వతి, సుశీలా మెదిలారు...

ఆనాటి పార్వతికి మాతృత్వం కావాలి...

ఈనాటి పార్వతికి స్నేహితురాలు కావాలి!

రెండూ దొరకనివే!

కానీ.. పార్వతి వొళ్లోనిశ్చింతగా నిద్రిస్తున్న ఆ పసికందులో రెంటినీ చూడవచ్చు!!

భగవంతుడు మనుష్యులతో ఎంత చిత్రంగా ఆడుకుంటాడు!!

కోరికలు తీరినట్లే అనిపించి, ఒక్కక్షణంలో సంతోషంతో గంతులు వేయిస్తాడు. మరుక్షణం అన్నీ ఆశాభంగాలే అనిపించి, కృంగిపోయేలా చేస్తాడు.

"ఏమండీ పాప చూడండి! ఎంత అందంగా నవ్వుతుందో --- అంతా సుశీ పోలికే ... ఎంత ముద్దుగా వుందో — పాపం తల్లిలేని లోటు...'

అంది పార్వతి ... ఉన్నట్లుండి...

రాజారావు చకితుడయ్యాడు.

ఒక్కక్షణం ఆగి పార్వతి మళ్లీ అంది —

"తల్లిలేని లోటు ఏముంది — నేను లేనా? పాపకి నేనే తల్లిని ... "

ఈ రంగురంగుల మనస్తత్వాన్ని చూసి,రాజారావు కనిపించింది. "ఇంద్రధనస్సులోని రంగులన్నీ పార్వతిలోనే వున్నాయి... అందుకే పార్వతి అంత అందమైన మనసు కలది ..." అని!!


డాక్టరుగా వుండండి!

ఇంటివద్ద నున్నప్పుడు పోస్టల్ ట్యూషన్ ద్వారా ప్రభుత్వ రిజిస్టర్డు కాలేజీనుండి డిప్లొమా పొందగలరు. ఉచిత ప్రాస్పెక్టస్‌నకు వ్రాయండి.

INDIAN HOMEOPATHIC COLLEGE,
(A.W.) Jullundur City.



రాంతీర్థ బ్రాహ్మి ఆయిల్

(స్పెషల్ నెం. 1) (రిజిష్టర్డు)



చుండు, వెండ్రుకలు రాలుట పోవి, వెండ్రుకలను పట్టువలె మృదువుగాను, కాంతిగాను నల్లగాను చేయు అమూల్యమైన హెయిర్ టానిక్. ఇది మెదడును చల్లబరచి, జ్ఞాపకశక్తిని సెంపొందించి, కండ్ల వేడిమి, నిరంతర శిరోబాధ తగ్గించును. హాయిగా నిద్ర పట్టించును.

యోగాసన చార్టు

సచిత్రమైన మా యోగాసన చిత్రపటంతో చూపిన వివిధ యోగాసనముల నిరంతర అభ్యాసమువల్ల ఆరోగ్యకరమైన మంచి శరీరదార్ఢ్యత పొందండి.

పోస్టేజితో ధర రు. 3/—లు మాత్రమే.

శ్రీ రాంతీర్థ యోగాశ్రమం

దాదర్, బొంబాయి 14.